క్లుప్తంగా

పదో తరగతి విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు పంపిణీ



విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చీమకుర్తి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చీమకుర్తి మండలంలోని గాడిపర్తివారిపాలెం, బండ్లమూడి, పల్లామల్లి జిల్లాపరిషత్ హైస్కూళ్లలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు శనివారం రైటింగ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి కోటేశ్వర రావు, ఎం.తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు పరాంకుశం శ్రీనివాసమూర్తి, ముప్పూరి చలమయ్య, అంబటి వీరారెడ్డితో కలిసి రోటరీ క్లబ్ సభ్యులు విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లతో పాటు పెన్నులు అందజేశారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్నపత్రాలు



మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో పదో తరగతి ప్రశ్న పత్రాలను డిపాజిట్ చేస్తున్న కస్టోడియన్లు

మద్దిపాడు: పదో తరగతి ప్రశ్నపత్రాలను కస్టోడియన్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం డిపాజిట్ చేశారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో శనివారం మొదటి సెట్ పేపర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేశారు. ఆదివారం రెండో సెట్ పేపర్లు డిపాజిట్ చేస్తున్నట్లు రూట్ ఆఫీసర్లు తెలిపారు. పరీక్షలు జరిగే రోజు ఉదయం 7 గంటలకు చీఫ్ సూపరింటెండెంట్లకు ఏ సెట్ పేపరు ఇవ్వాలన్న విషయం చెబుతారని వారు తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

ఒంగోలు టౌన్: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించేలా చిరుధాన్యాలు తీసుకోవాలని సీడీపీవో కె.ఫణిరాజకుమారి తెలిపారు. శనివారం స్థానిక విజయనగర్ కాలనీలోని ఏ సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. రాగులు, జొన్నలు, సజ్జలతో అత్యధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారు చేసుకునే విధానాన్ని తెలిపారు. పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం, సంతోషంగా జీవించవచ్చని అన్నారు. జంక్ ఫుడ్, నాశిరకం ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు పలువురు మహిళలు, బాలింతలు పాల్గొన్నారు.



యరజర్లలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు



సర్వేరెడ్డిపాలెంలో...

ఆనందాభిషేకం..!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నగదును శనివారం విడుదల చేయడంతో పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు ఆనందం వ్యక్తం చేశారు. తమకు ఆర్థిక భరోసా ఇస్తూ అండగా నిలిచి ఆదుకుంటున్న జగనన్న చిత్రపటాలకు పలు ప్రాంతాల్లో క్షీరాభిషేకం చేశారు. ఒంగోలు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఒంగోలు ఏపీఎం గోపీనాథ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంధ్యారాణి, వీవోఏలు, గ్రూపు లీడర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

– ఒంగోలు రూరల్



చేజర్లలో...



గుండాయపాలెంలో...

చెత్త సంపద తయారీ కేంద్రం ఉపయోగాలపై శిక్షణ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో పద్మ

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ఉపయోగంపై ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఎల్‌పీవో ఆర్.పద్మ తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా శిక్షణ నిమిత్తం శనివారం కె.పల్లెపాలెం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆమె సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ జిల్లాలోని 3 డివిజన్లలో మూడు చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాటిలో ఒంగోలు డివిజన్ పరిధిలో కె.పల్లెపాలెం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని శిక్షణకు ఎన్నుకున్నామన్నారు. 12 మండలాల్లో ఉన్న పంచాయతీల నుంచి ఈ శిక్షణకు రావడం జరుగుతుందన్నారు. రోజుకు 4 పంచాయతీలలో 10 మంది చొప్పున 40 మంది హాజరుకావాల్సి ఉందన్నారు. ప్రధానంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీకంపోస్టు ఎరువులు ఎలా తయారు చేయాలి, తడి, పొడి చెత్తను ఏ విధంగా వేరు చేయాలి, నాడెప్ తొట్లలో చెత్త ఏ విధంగా వేయాలి, సేంద్రియ ఎరువులు ఎలా చేయాలి, ఎంత ధరకు విక్రయించాలి అనే విషయాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

పూర్తిగా చెత్త సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తెచ్చి లాభసాటిగా చేయడానికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, క్లాప్ మిత్రలు శిక్షణకు హాజరవుతారని చెప్పారు. శిక్షణకు ఏర్పాట్లను డీఎల్‌పీవో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి శాంబాబు, వెంకటేశ్వరరెడ్డి, సాయి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్తినూతలపాడు హైస్కూల్లో ఘనంగా ఫేర్‌వెల్



10వ తరగతి విద్యార్థుల గ్రూప్ ఫొటో

ఒంగోలు రూరల్: ముక్తినూతలపాడు హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, గేయాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హెచ్‌ఎం సరస్వతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరి జీవితంలో ఇంటర్, 10వ తరగతి కీలకమని అన్నారు. మంచి విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్పొరేట్ స్థాయికి తగ్గకుండా ఇంగ్లిషులోనే కార్యక్రమం నిర్వహించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు మురిసిపోయారు. చివరిగా.. గ్రామంలోని హైస్కూల్లోనే కార్పొరేట్ స్థాయికి ధీటుగా విద్యా బోధన చేస్తుంటే.. కార్పొరేట్ పాఠశాలలవైపు పరుగులు ఎందుకు తీస్తున్నారని తల్లిదండ్రులను ప్రశ్నించే విధంగా కళారూపాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం సరస్వతి

బాపనయ్య స్ఫూర్తితో పోరాటాలు

ఒంగోలు టౌన్: మూడు సార్లు శాసనసభ్యునిగా, ఒకసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన గుంటూరు బాపనయ్య అంటరానితనం అంతం కోసం పోరాటం చేశారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు అన్నారు. స్థానిక ఎల్బీజీ భవన్‌లో శనివారం గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి నిర్వహించారు. దున్నేవానికే భూమి దక్కాలని, చల్లపల్లి జమిందార్ ఆగడాలకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు చేసిన ప్రజా నాయకుడు బాపనయ్య అని కొనియాడారు. తెలంగాణలో నైజాం నవాబు, వెంకటగిరి రాజాతో పాటుగా 400 మంది జమీందారులు రైతు కూలీల మీద చేస్తున్న దాష్టికాలను తిప్పికొట్టేందుకు కమ్యూనిస్టులు చేసిన పోరాటాలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జాలా అంజయ్య వివరించారు. బాపనయ్య స్ఫూర్తితో పోరాటాలను కొనసాగిస్తామని నాయకులు ప్రతినబూనారు. కార్యక్రమంలో నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల వెంకటేశ్వర్లు, పి.కల్పన, రమాదేవి, సయ్యద్ షమ్మీ, కాలం సుబ్బారావు, జయప్రకాష్, జీవీ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టీజేఆర్‌ను అభినందించిన నాయకులు



ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును అభినందిస్తున్న నాయకులు

చీమకుర్తి: సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ఒంగోలులోని ఆయన కార్యాలయంలో కలిసి అభినందించారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు. అసెంబ్లీలో స్పీకర్‌పై టీడీపీ నాయకులు దాడి చేయడానికి ప్రయత్నించినప్పుడు టీజేఆర్ సుధాకర్‌బాబు అడ్డుకునే సమయంలో గాయం కావడంతో పరామర్శించారు. స్పీకర్‌పై దాడి చేసిన సమయంలో అడ్డుకున్న విధానాన్ని అభినందించారు. నియోజకవర్గంలోని మద్దిపాడు, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాలకు చెందిన వైఎస్సార్ నాయకులు దుంపా చెంచిరెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, దుంపా యలమందారెడ్డి, కుమ్మరి సుధాకర్, స్థానిక నాయకులు కలిసి అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అల్లూరులో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న బాపట్ల కళాశాల విద్యార్థులు

అల్లూరు (కొత్తపట్నం): పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బాపట్ల కళాశాల పశువైద్యాధికారి డాక్టర్ కె.విజయ్‌ప్రకాష్ రైతులకు సూచించారు. జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా శనివారం బాపట్ల కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు పశువులకు వచ్చే సీజినల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అల్లూరు గ్రామ రైతులకు చెందిన పశువులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం గాలికుంటు, నట్టల నివారణపై రైతులు శ్రద్ధ చూపించి పశువైద్యులకు చూపించుకోవాలని వివరించారు. డాక్టర్ శోభ మాట్లాడుతూ పశువులను ఆశించే అనేక వ్యాధులు, చూడి పశువులకు కావాల్సిన మందుల గురించి తెలిపారు. పాడి పశువుల్లో పాల దిగుబడి, వెన్న శాతం పెరుగుదలకు వాడదగిన పోషకాల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంత పశువులు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా పాల దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందన్నారు. 50 పశువులకు పరీక్షలు జరిపి వివిధ రకాల వ్యాధులను గుర్తించారు. వ్యాధులకు తగిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. బాపట్ల కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రవిబాబు, పీఆర్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పశువుల పెంపకంలో పచ్చిమేత ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో ఒంగోలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, సమన్వయకర్త డాక్టర్ రాజశేఖర్, శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ వరప్రసాద్, డాక్టర్ రమేష్, రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

నేషనల్ స్కాలర్‌షిప్ పరీక్షలో విద్యార్థినుల ప్రతిభ



ఇనమనమెళ్లూరు విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చీమకుర్తి: నేషనల్ మీన్స్ కంమెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు అంజలి గౌతమి, రుషిత ప్రతిభ చూపి స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రామారావు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను టీచర్లు అభినందించారు. ఎంపికైన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు.

ఆరుగురు ఇనమనమెళ్లూరు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు...

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం వసుంధర తెలిపారు. అర్హత సాధించిన భీమవరపు రామాంజమ్మ, యెండ్లూరి సుప్రియ, గవడకట్ల శ్రీభవ్య, శివశంకర్, గాలం సాయిపూర్ణిమ, లక్ష్మీభువనకృతిలకు 4 సంవత్సరాలపాటు ఏడాదికి రూ.12 వేల స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న పూర్ణచంద్రరావు

ఒంగోలు: స్థానిక కొప్పోలు గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను అంబేడ్కర్ యువజన సంఘం పెద్దలు పూర్ణచంద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ గొప్పతనం గురించి సమాజంలోని ప్రతిఒక్కరికీ తెలియజేయాల్సిన అవసరాన్ని చాటి చెప్పేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ బెంగళూరు నరసయ్య మాట్లాడుతూ పోటీలు ఏప్రిల్ 14వ తేదీ వరకు జరుగుతాయన్నారు. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం క్రికెట్ పోటీల నిర్వాహకులు మాట్లాడుతూ బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్ బహుమతులను ప్రతి మ్యాచ్‌కు ఇస్తూ అంబేడ్కర్ గొప్పతనం గురించి నేటి తరానికి తెలియజేసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణం కోసమే స్టార్టప్ ఇండియా

ఒంగోలు: దేశంలో బలమైన పర్యావరణ వ్యవస్థ నిర్మాణానికి, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించేందుకు స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామాత్యులు పియూష్ గోయల్ సమాధానమిచ్చారు. పార్లమెంట్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ పథకం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాధించిన పురోగతి, ఆమోదితమైన ఆర్థిక సంస్థలు, ఎన్నికైన నూతన కార్యక్రమాలు, ఆమోదితమైన ఆర్థిక సాయం గురించి ప్రశ్నించారు. అందుకు కేంద్రమంత్రి సమాధానమిస్తూ 2016లో ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఉత్పత్తుల ఆశయసాధనకు, అభివృద్ధికి, సామర్థ్య పరిశోధనకు, మార్కెట్‌లో ప్రవేశపెట్టేందుకు, వ్యాపారీకరణకు ఈ పథకం కింద సంస్థల ప్రారంభ కార్యక్రమాలకు ఆర్థికసాయాన్ని కేంద్రం అందిస్తోందన్నారు. 2023 ఫిబ్రవరి 28 నాటికి దేశంలో రూ.537.25 కోట్ల ఆర్థిక సాయానికి 148 సంస్థలను ఆమోదించడం జరిగిందని, ఆంధ్రప్రదేశ్‌లో రూ.9 కోట్లకు మూడు సంస్థలు ఆమోదించడం జరిగిందని వెల్లడించారు.

రైతు సమీక్షలో పాల్గొన్న మారెడ్డి



రైతు సమీక్షలో మాట్లాడుతున్న మారెడ్డి సుబ్బారెడ్డి

చీమకుర్తి: తాడేపల్లిలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రైతు సమీక్షలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మారెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు. రైతు విభాగం రాష్ట్ర బాధ్యుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమీక్షలో రాష్ట్రంలోని రైతుల సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన విధానాలపై చర్చించినట్లు మారెడ్డి తెలిపారు.

విద్యార్థులు బాధ్యతగా మెలగాలి

ఒంగోలు టౌన్: విద్యార్థులు చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని ఒంగోలు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. భాష్యం విద్యాసంస్థల 15వ వార్షికోత్సవాన్ని స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూల్ ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలిగినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ సుశీల వార్షిక నివేదికను వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



యంత్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ బాబూరావు

చీమకుర్తి: స్వయం సహాయక గ్రూపుల మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ బీ బాబూరావు కోరారు. రూ.10.50 లక్షలతో పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా పులికొండ గ్రామానికి చెందిన కీర్తన గ్రూపు మహిళ అవధారి కృష్ణవేణికి ఇడ్లి, దోశ పిండి, కారం, పసుపు మిషన్ అందించారు. 35 శాతం సబ్సిడీతో అందించిన మిషన్ ద్వారా రోజుకు రూ.800 ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. మిగిలిన సభ్యులు కూడా ఇదే పద్ధతిలో ఆర్థికంగా ఎదిగేందుకు వ్యాపారాలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం సుబ్బారావు, ఏపీఎం కోటేశ్వరరావు, స్థానిక సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న నారాయణం కేశవాచార్యులు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది గ్రామంలో సీతారామచంద్రస్వామి, వేణుగోపాలస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి 132 వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. 23వ తేదీ అంకురార్పణ సేవతో ప్రారంభం కాగా, 24న సీతారామచంద్రస్వామి ధ్వజస్తంభానికి వేదమంత్రాలతో గరుడాటము ఎగురవేసి మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు మహానివేదన, మంగళహారతి నిర్వహించారు. లాంఛనంగా కార్యక్రమాలు ప్రారంభమవగా, టీటీడీ వేదపండితుడు రాజేష్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణంకేశవాచార్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి వెలగం శ్రీనివాస్, రంగయ్య, పాల్గొన్నారు.



ధ్వజస్తంభ సేవలో ఆలయ పండితులు